
# సుబ్బరాజుకి ఫోనొచ్చింది!

పాటిల్ రవీంద్రనాథ రెడ్డి



'కిర్ర్ర్' మంటూ విచిత్రమైన శబ్దాన్ని ఎనిమిదిసార్లు చేసి సైలెంట్ అయిపోయింది గడియారం.

మెలకువ వచ్చి దుప్పటిని అవతలికి విసిరేసి కూర్చున్నాడు సుబ్బరాజు. రోజూలాగా బాత్రూం కెళ్ళకుండా పుస్తకాల షెల్ఫ్ దగ్గరకెళ్ళాడు. అయిదు నిమిషాల్లో నీట్‌గా సర్దివున్న పుస్తకాలను చెత్తకుండీలా విజయవంతంగా మార్చి, ఒక చిన్న డైరీ తీసుకుని వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పక్కనే టేబుల్ మీద ఫోన్! కొత్తది!

సుబ్బరాజుకు ఫోనంటే క్రేజ్!

తన కోసం ఫోన్ రింగవటం, కనీసం రోజుకు ఓ పది సార్లయినా —తను విలాసంగా ఫోనెత్తి మాట్లాడటం —పెట్టిన వెంటనే మళ్ళీ రింగయితే విసుగ్గా ఫోనందుకోవటం —బోర్ కొట్టినప్పుడు ఫ్రెండ్స్‌తో ఫోనులోనే జోకులేసుకుంటూ మాట్లాడటం —వేరే ఊరెళ్ళినపుడు రాత్రిపూట ఫోన్‌లో భార్యను పలకరించటం —వగైరా వగైరా కోరికలెన్నో సుబ్బరాజు మెదడులో రోజూ రింగవుతూ వుంటాయి!

ఈ కోరికలన్నీ తీరాలంటే ఇంట్లో ఫోనుండాలి! ఫోనీ ఆఫీసు ఫోనుతో ఎంజాయ్ చేద్దామంటే, తన టేబుల్‌మీద పర్సనల్ ఫోన్ వుండేంత పెద్ద ఉద్యోగం కాకపోయె!

ఒక సంవత్సరం పాటు ఒక మోస్తరుగా వున్న కోరిక. ఈ మధ్య మరీ ఎక్కువయిపోయింది. కలలో కూడా వచ్చేస్తోంది ఫోన్ అడపాదడపా! ఉన్నది ఒకటే జీవితం, ఇంత చిన్న కోర్కెను కూడా తీర్చుకోలేక పోతే ఏం సార్థకమనుకున్నాడు! వెళ్ళి టెలిఫోన్‌కు అప్లయ్ చేశాడు! రెండు సంవత్సరాల తర్వాత ఇస్తామన్నారు.

ఆ మాటతో సుబ్బరాజు డీలా పడిపోయాడు!

ఏం చేయాలో తోచక స్నేహితుడు భాస్కర్‌ను సంప్రదించాడు.

ఆ రోజు నుంచి ఫోన్ సమస్య భాస్కర్ చుట్టూ రింగవడం మొదలయ్యింది.

ఎలాగైతేనేం?— డిపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తిని పట్టుకోవడం —అతని చుట్టూ డబ్బు రెండు సార్లు, సుబ్బరాజు భాస్కర్ పదిసార్లు రింగవడం

—భూమి తనచుట్టూ తాను ఓ వందసార్లు రింగవడం అయిపోయాక —నిన్న రాత్రి ఏడుగంటలా, ఏడు నిమిషాల ముప్పయి ఏడు సెకన్లకు సుబ్బరాజింట్లో ఫోన్‌రింగయింది!

ఇక ఈరోజు —పొద్దున లేవగానే ఫోన్ ముఖం చూసిన మొదటి రోజు సుబ్బరాజుకు! అందుకే —లేవగానే అన్ని కార్యక్రమాలూ పక్కన పెట్టి, పాచి ముఖం తోనే భాస్కర్ నంబరున్న డైరీ తీసుకుని ఫోన్ పక్కన సోఫాలో కూర్చున్నాడు!

భార్య వంటింట్లో పనిచేసుకుంటోంది. గిన్నెల శబ్దం వినిపించడంతో చిరాకు పడ్డాడు సుబ్బరాజు! ఫోన్ ఓనర్!!

"లక్ష్మీ! కాస్సేపు శబ్దం చేయకు! ఫోన్ చేస్తున్నా" అన్నాడు. ఆ ప్రీతి ఫోన్ మీదనో. లక్ష్మి మీదనో?

రిసీవర్ అందుకున్నాడు —మెత్తగా. అపురూపంగా —పెళ్ళిలో మొదటిసారి భార్య చేతిని అందుకున్నట్టు! ఇంతకు ముందు సుబ్బరాజు రెండు, మూడుసార్లు ఫోనులో మాట్లాడి వున్నా ఇది తన ఫోను! తన కోరిక! తన ఆనందం!! అందుకే అంత ఫీలింగు!

భాస్కర్ ఫోన్ నెంబర్స్‌ను ప్రెస్ చేశాడు— సున్నితంగా మొదటి రాత్రి భార్యను తాకినట్టు! డయల్ అవుతున్న శబ్దాన్ని ఎంజాయ్ చేస్తూ కూర్చున్నాడు!

అవతల ఫోన్ ఎత్తిన శబ్దంతో పాటు "హలో" అంటూ వినిపించిందొక బొంగురు గొంతు!

"భాస్కర్!" అన్నాడు సుబ్బరాజు!

"భాస్క రెవడు?" అవతల్నుంచి!

అది భాస్కర్ గొంతులా అనిపించలేదు!

"భాస్కర్ లేడా?"

"ఎవడూ లేడు!" ఫోన్ పెట్టేశాడా అవతలి వ్యక్తి!

'భాస్కర్ ఇంట్లో లేకపోతే మాత్రం అలా సమాధానమివ్వాలా? బయటికెళ్ళాడని మర్యాదగా చెప్పొచ్చు కదా! మాట్లాడింది భాస్కర్ మామలా గున్నాడు. ఎంత ఇల్లరికం అల్లుడయితే మాత్రం వాడూ వీడూ అంటూ మాట్లాడ్తాడా? మనసులోనే కోపగించుకున్నాడు సుబ్బరాజు.

మళ్ళీ నంబర్స్ నొక్కాడు!

"హలో!" అదే బొంగురు గొంతు!

"నేను భాస్కర్ స్నేహితుణ్ణి సుబ్బరాజుని! భాస్కర్ ఎన్నింటికి వస్తాడు?"

"భాస్కర్ ఎవడు బే?! ఈడ అటుంటో డెవడూ లేడన్జెప్పిన గదా!"

"అది! భాస్కర్ ఇల్లు కాదా?" సుబ్బరాజుకు కొద్దిగా జ్ఞానోదయమయింది!

"మరదే నాన్జెప్పింది" వెంటనే ఫోన్ పెట్టేసిన శబ్దం!

కాసేపు ఆలోచించాడు —ఎక్కడ పొరపాటు జరిగిందా అని? తను నంబరేమైనా తప్పు రాసుకున్నాడా? పాత పర్సులో వున్న విజిటింగ్ కార్డు గుర్తొచ్చింది! వెళ్ళి పెట్టిలోని పర్సు తీసి



పనిమనిషి: అమ్మగారూ! మీరు అయ్యగారికి టీ ఇచ్చినప్పుడల్లా పరీక్ష చేసి తాగుతాడు ఎందుకమ్మా?

అమ్మగారు: నా మొదటి భర్తకు టీ లో విషం వేసి చంపిన విషయం ఆయనకు తెలిసినట్లుంది.

వై. రాంబాబు, తాడేపల్లిగూడెం

చూశాడు. 'సేమ్ నెంబర్!! మరయితే తాను తొందరలో వేరే నంబర్లు నొక్కి వుండాలి? 'ఈసారి జాగ్రత్తగా చేయాలి!' అనుకుంటూ రిసీవర్ అందుకున్నాడు!

ఒక్కో నంబర్ పైకే అనుకుంటూ ప్రెస్ చేశాడు!

డయల్ వినిపిస్తోంటే —టెన్షన్ మొదలయింది! టెన్షన్ మరీ ఎక్కువ కాకముందే అవతల రిసీవర్ ఎత్తినశబ్దం!

"హలో!"

అదే బొంగురు గొంతు!

సుబ్బరాజుకేం చేయాలో తోచలేదు. కాస్సేపాగి—

"హలో..." మెల్లగా,కీచుగా అన్నాడు —ఏం తిడ్తాడో అనుకుంటూ!

"ఎవుడు గావాలా?"

"నేనే! భాస్కర్ కోసం చేసినోణ్ని!"

"ఉస్" అవతల వైపు నుంచి భారంగా నిట్టుర్చిన శబ్దం!

"నువ్వే నంబర్‌కు జేస్తున్నావ్ బే?" సహనానికి చివరి అంచున ఉన్నట్టున్నాడు.

"నేను 822434 చేస్తున్నాను" అవతలి నుంచి తిట్లురాక పోవడంతో కాస్త ధైర్యం పుంజుకుని అన్నాడు సుబ్బరాజు.

"ఇది 822443" ఫోన్ పెట్టేశాడా బొంగురు గొంతు వ్యక్తి!

సుబ్బరాజుకంతా తికమకగా వుంది!

తాను సరిగ్గానే ప్రెస్ చేశాడు. ఎందుకిలా జరుగుతోంది? ఎక్కడ పొరపాటు జరుగుతోంది? కాస్సేపటికి ఆలోచనలతో బుర్ర వేడెక్కింది!

తిరిగి రిసీవర్ అందుకున్నాడు పట్టువదలక! పిల్లలు ఎక్కాలు చెప్పినట్టు గట్టిగా బయటికే ఉచ్చరిస్తూ —అంతకంటే గట్టిగా నొక్కాడు నంబర్స్‌ను. డయల్ వినిపించడం మొదలవగానే అసహనం పోయి మళ్ళీ టెన్షన్ మొదలయ్యింది!

అవతల రిసీవర్ ఎత్తిన శబ్దంతో నిటారుగా కూర్చున్నాడు!

"హలో!!" అదే బొంగురు గొంతు!!

తన ప్రమేయం లేకుండానే దబ్బున రిసీవర్ పెట్టేశాడు! అయిదు కిలోమీటర్లు ఒక్క ఉదుటన పరుగెత్తుకొచ్చి కూర్చున్న వాడిలా ఆయాస పడుతున్నాడు.

కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కు వాలి పడుకున్నాడు. కాస్సేపటికి టెన్షన్ తగ్గిపోయి మనసంతా ప్రశాంతంగా తయారయింది! లేచి వంటింట్లో కెళ్ళాడు!

ఉదయం లేచినప్పుడున్నంత ఉత్సాహం లేదు. అడుగులు బలహీనంగా పడుతున్నాయి.

విషయం లక్ష్మికి వివరించాడు! కాస్సేపు సీలింగ్ కేసి సీరియస్‌గా చూసి "ఐడియా!" అంటూ గట్టిగా అరిచింది!

"ఏమిటది?" ఆత్రంగా అడిగాడు.

"మీరు మన భాస్కర్ నంబరుకు చేస్తే, వేరే నంబరు కెళ్ళిందన్నారు! ఆ నంబరడిగారా?"

"ఆ! భాస్కర్‌ది 822434. వాడిది 822443"

"ఇప్పుడుమీరు ఆ నెంబరుకు చేయండి! భాస్కర్ ఇంటికి పోతుందేమో?!"

'అబ్బ! ఏం బుర్రే నీది' అన్నట్టు భార్య వైపు మురిపెంగా చూసి గబగబా అడుగులేస్తూ ఫోన్ దగ్గర కెళ్ళాడు. ఆత్రంగా రిసీవర్ ఎత్తి జాగ్రత్తగా ప్రెస్ చేశాడు బొంగురు గొంతు వాడి నంబరు!

డయల్ వింటూ, మ్యూజిక్ విన్నట్టు ఫీలవ్వ సాగేడు!

రిసీవర్ ఎత్తిన శబ్దం! "హలో!!!"

అదే గొంతు! బొంగురు గొంతు!!

చెవిలోకి పిస్టల్ పేలినట్లు అదిరి పడ్డాడు సుబ్బరాజు! నోటి నుంచి మాట పెగల్లేదు! రిసీవర్ పట్టుకున్న చేయి సన్నగా వణక సాగింది!

'హలో' అన్న తర్వాత కూడా రెస్పాన్స్ రాక పోయే సరికి చేసిందెవరో పట్టేసినట్టున్నాడు బొంగురు గొంతు!

"బద్మాష్! మల్ల జేసినవ్ బే!"

"అది కాదండి! ఇందాక మా భాస్కర్ ఇంటికి చేస్తే మీ కొచ్చింది! ఈ సారి మీకే చేశాను —భాస్కర్ ఇంటికి పోతుందేమోనని".. మాట పూర్తి కాంకుండానే అందుకున్నాడు సీరియస్‌గా బొంగురు గొంతు!

"నువ్ కొవ్వు బట్టినవ్ బే! నాకే ఫోన్ చేసి కథల్ జెప్తుండవ్ —ఎన్ని దమ్ముల్ బే నీకు? మస్తాన్ బాషా తెల్సా?"

సుబ్బరాజు ఏం మాట్లాడలేదు!

"పాత బస్తీ దాదాని బే! మల్లగాని జేస్తివా కొడకా —ఎమ్కలు నుసి జేసి హుస్సేన్ సాగర్లో గల్పుతా! ఖబడ్దార్! ఫోన్ పెట్టెయ్!!"

వెంటనే రిసీవర్ పెట్టేసింది సుబ్బరాజు చెయ్యి!

పొద్దున్నే లేచి ఫోన్లోనే చెప్పుతో కొట్టించుకున్నట్టయ్యింది. మామూలు మనిషి కావడానికి పది నిమిషాలు పట్టింది!

** ** **

ఆఫీసులో భాస్కర్‌కు విషయమంతా చెప్పి, బలవంతాన ఇంటికి లాక్కొచ్చాడు. భాస్కర్ ఎక్సేంజ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు! 'కొత్త

కనెక్షన్ కాబట్టి ఇంకా సరిపోయినట్టు లేదు. సరి చేస్తామ'న్నారు!

ఇంట్లో ఫోనుంది! కానీ అది మోగడం లేదు! తనకు ఫోన్ చెయ్యండని ఎవర్నడుగుతాడు? హాల్లో కొచ్చినప్పుడల్లా దాని వంక చూస్తాడు — చచ్చిన పంది కొక్కులా కనిపిస్తోందది టేబుల్ మీద!

రాత్రి భోంచేశాక బెడ్‌మీద పడుకుని పైకి చూస్తున్నాడు సుబ్బారాజు!

ఫోనైతే వేయించుకున్నాడు గానీ —ఫోన్లమీద ఫోన్లు రావడం, తను మాట్లాడుతూ బిజీగా వుండాలనే కోరిక తీరడం లేదు. దిగులుగా వుంది సుబ్బరాజుకు!

లక్ష్మి వంటిల్లు సర్ది వచ్చి భర్త పక్కన పడుకుంది. తనను గమనించని సుబ్బరాజు వంక చూస్తూ అడిగింది —"ఏమిటండీ అలా వున్నారు?"

"ఏం లేదు!" పొడిగా జవాబిచ్చాడు!

"నాతో చెప్పకూడదా?" దగ్గరగా జరుగుతూ అంది.

కాస్సేపాగి —చెప్పాడు తన బాధ! విన్నాక లక్ష్మి కూడా ఆలోచనలో పడింది!

పది నిమిషాలు గడిచాక "ఐడియా!" అంటూ అరిచింది లక్ష్మి! చెవి దగ్గర అరవడంతో అదిరి పడి లేచి కూర్చున్నాడు సుబ్బరాజు!

లక్ష్మి తన ఐడియా వివరించింది!

విన్న సుబ్బరాజు ముఖం వెలిగిపోయింది! "ఏం బుర్రే నీది!" అంటూ లక్ష్మిని వాటేసుకున్నాడు!

అప్పటికి రెండు రోజుల క్రితమే —లక్ష్మి 'ఐడియా' వలన, పాత బస్తీ దాదా మస్తాన్ —బాషాతో పొద్దున్నే అమ్మనా బూతులూ తిట్టించుకున్న సంగతి గుర్తుకు రాలేదు సుబ్బరాజుకు!

** ** **

రెండు రోజుల తర్వాత —

ఒక ప్రముఖ దినపత్రికలో —లోపలి పేజీలో మూలగా —ఒక ప్రకటన ప్రచురించబడింది!

'నూతన నటీనటులు కావలెను!' అన్న హెడ్డింగుతో క్రింద ఇలా వుంది —

'మేమొక సినిమాను ప్రారంభించబోతున్నాము. అందుకు అందరూ కొత్తవారు కావలెను. అందం, ఆసక్తి గల నటీనటులు, ప్రతిభ గల గాయనీ గాయకులు క్రింది ఫోను నంబరుకు సంప్రదించవలెను!'

క్రింద సుబ్బరాజు ఫోన్ నంబర్ ప్రచురించబడి వుంది!

గబగబా మొహం కడుక్కొని కాఫీ తాగి వచ్చి సోఫాలో కూర్చున్నాడు! అరగంట ఎదురు చూశాక ఫోన్ రింగయింది. ఎగిరి దాన్నందుకోబోయి —మళ్ళీ ఆగి —చేయి వెనక్కు తీసుకుని —విలాసంగా రిసీవర్ అందుకుని అన్నాడు —

"సుబ్బరాజు హియర్!"

"గుడీవినింగ్ సార్!" అవతల్నుంచి వినయంగా! సుబ్బరాజు ఛాతీ డబలైంది. రూములో



కుటుంబారావు: ఓరేయ్ సుబ్బారావ్ ఈ వీధిలో అందరూ పశువులను పెంచుతూ పాలవ్యాపారం చేస్తున్నారు కదా! నువ్ ఏమి వ్యాపారం చేయాలనుకుంటున్నావు?

సుబ్బారావు: నీళ్ళ వ్యాపారం చేయాలనుకుంటున్నాను.

కుటుంబారావు: బాగుందిరా నీ ఆలోచనా....!

వేగేశ్న సత్యనారాయణరాజు
ఆత్రేయపురం

వున్న గాలంతా పీలుస్తున్నట్టు బలంగా పీల్చి వదిలాడు!

"గుడీవినింగ్!" స్టైల్‌గా అన్నాడు!

"మీరేనా సార్? సినిమా ప్రారంభిస్తున్నామంటూ ప్రకటనిచ్చింది!"

"యస్!"

"సినిమా అంటే చాలా అమౌంట్ కావాల్సొస్తుంది సార్!"

"నాకు తెలుసు"

"అహ! మీకు తెలీదని కాదు సార్! అనుకున్న దాని కంటే బడ్జెట్ పెరిగిపోతుంది. అలా జరిగే మధ్యలో నా సినిమా ఆగిపోయింది!"

సుబ్బరాజుకతను చెప్పింది అర్థం కావడం లేదు! అయినా "చెప్పండి!" అన్నాడు.

"మీరు కొత్త సినిమా తీయకుండా —ఆ డబ్బేదో నా సినిమాకు ఖర్చు పెడితే —మీకు చాలా రిస్కు తగ్గుతుంది! తొందరగా లాభాలూ చూడొచ్చు!"

సుబ్బరాజు కేం సమాధానం చెప్పాలో తోచ లేదు.

"సార్!"

"ఊ!"

"మీ రొస్తే? —ఇప్పటి వరకూ తీసిన నా సినిమా చూడొచ్చు! నిర్మాతగా మీ పేరే వేస్కుందురు!"

"ఉ! ఊ" మూలిగాడు సుబ్బరాజు!

"మీ అడ్రసిస్తే కారు తీసుకు వస్తాను!"

ఊపిరాడనట్టయ్యింది సుబ్బరాజుకు!

"అప్పుడే తొందరేముంది లెండి! రెండ్రోజులాగి మళ్ళీ ఫోన్ చెయ్యండి. అపుడు విషయం చెప్తాను" అంటూ ఫోన్ పెట్టేశాడు!

సుబ్బరాజుకు తన ఆనందాన్ని ఎలా సెలబ్రేట్ చేసుకోవాలో అర్థం కావడం లేదు. ఎవరో నిర్మాత తనకు ఫోన్ చేయడం —సినిమాకు డబ్బు సర్దమని అడగటం —తను చూద్దాం అనటం —అంతా కల మాదిరిగా అనిపిస్తోంది! కిక్కిస్తోంది!

ఎవరైనా బలవంతం చేస్తే తప్ప సిగరెట్ తాగే అలవాటులేని సుబ్బరాజుకు సిగరెట్ తాగాలనిపించింది. వెంటనే లేచి, చెప్పులేసుకుని బయటకు నడిచాడు! ఇంటి ముందు నిలబడి, చుట్టూ నాలుగిళ్ళకు వినిపించేలా చెప్పాడు లక్ష్మితో —

"ఫోనొస్తే పదినిమిషాలాగి చేయమను, నేనిప్పుడే వస్తాను!" అంటూ ఠీవిగా నడుచుకుంటూ వెళ్ళి సిగరెట్ తెచ్చుకున్నాడు!

పొగనలా గాల్లోకి రింగులుగా వదిలే ప్రయత్నం చేస్తున్నంతలో —ఫోన్ రింగయింది!

"హలో!" సుబ్బరాజు హియర్!"

"హలో!" ఆడగొంతు!

ఫోన్లో పరాయి ఆడవాళ్ళతో మాట్లాడటం ఇదే మొదలు! ఎందుకయినా మంచిదని వెనక్కు చూశాడు —లక్ష్మి ఎక్కడుందో అని —లోపలున్నట్టుంది!

కాస్త గొంతు తగ్గించి అన్నాడు "ఊ! చెప్పండి! సినిమా ప్రకటనిచ్చింది నేనే!"

"నేను పాటలు పాడతానండి!"

"ఊ!" సుబ్బరాజు ఉక్కిరి బిక్కిరయి పోతున్నాడు!

"సినిమా పాటలకు సరిపోయేలా వుంటుంది నా గొంతు! పాడనా మరి?"

"ఊ!!"

ఆ పాట ప్రభావం నుండి కోలుకునేంతలో మళ్ళీ ఫోన్ రింగయింది.

"హలో! నేనే సినిమా ప్రకటనిచ్చింది!"

"సార్! నా పేరు అనసూయ! ఇప్పటికి రెండు సినిమాల్లో —చిన్న పాత్రల్లో నటించాను. మీ పిక్చర్లో హీరోయిన్ ఛాన్స్ ఇస్తారేమోనని ..."

"చూద్దాం!"

"సార్! నేను బాగా మూవ్ అవుతాను!"

"ఆ! ఆ! తీసేది మూవీ కదా! కెమెరా ముందు మూవ్ కావాలి మరి!"

"కెమెరా వెనక్కూడా!"

టక్కున ఫోన్ పెట్టేశాడు!

గుండె వేగంగా కొట్టుకోవడం, బి.పి. పెరగడం జరిగి —భయంగా చుట్టూ చూశాడు లక్ష్మి వుందేమోనని!

అంతలోనే —మళ్ళీ రింగయింది!

"హలో!" నీరసంగా అన్నాడు.

"సార్! సినిమా ప్రకటనిచ్చింది మీరేనా?"

"నేనే!"

"సార్! నా పేరు ప్రసాద్. స్మార్ట్‌గా వుంటాను. డాన్సొచ్చు! ఎత్తు అయిదడుగులా అయిదంగుళాలు. కొంచెం పొట్టే అనుకోండి! అయినా జాకీచానూ, అమీరుఖానూ పొట్టే కదా?! సార్ వింటున్నారా?"

"చెప్పు నాయనా"

"నాకు మీ సినిమాలో ఛాన్సివ్వండి సార్! నాకేం మీరు డబ్బివ్వాల్సిన పనిలేదు. నేనే ఓ పదివేలిస్తాను! సార్ వింటున్నారా?"

"ఆ!"

"వచ్చి కలవమంటారా?"

"అహ! అప్పుడే తొందరేముంది?"

"ఆ! మీకు మాత్రం తొందరగా సినిమా తీసి లాభాలు పొందాలనుండదా? మీ అడ్రసిస్తే వచ్చి కలుస్తాను సార్!"

"తర్వాత చూద్దాం"

"ఎందుకు సార్ ఆలస్యం. మీ అడ్రసు చెప్పండి!"

ఫోన్ పెట్టేశాడు సుబ్బరాజు!

వెంటనే మళ్ళీ రింగయింది. ఎత్తగానే "సార్! నేనే ప్రసాద్‌ని! అడ్రసు!"

ఫోన్ పెట్టేయడం —మళ్ళీ రింగవడం —ఎత్తి మళ్ళీ పెట్టేయడం —మళ్ళీ మళ్ళీ రింగవడం జరిగి పోయాక —రిసీవర్ తీసి పక్కన పడేసి, సోఫాలోనే పడి నిద్రపోయాడు సుబ్బరాజు!

** ** **

"ఏమండీ! బట్టల కింద పెట్టిన పదివేలు కనిపించడం లేదండి!" గట్టిగా అరిచింది పార్వతి.

"అక్కడే వుంటాయి. సరిగ్గా చూడు" అంటూ వచ్చి తానూ వెతక సాగేడు పార్వతీశం! ఎంత వెతి... కనిపించలేదు!

అక్కడే పెట్టినట్టు —నిన్న రాత్రి కూడా చూసినట్టు కచ్చితంగా చెప్పింది పార్వతి. ఇక ఇంట్లో వుండేది —కొడుకు ప్రసాద్!!

"ప్రసాద్ ఎక్కడి కెళ్ళాడు?" అడిగాడు పార్వతీశం!

"ఏమో నండి ఉదయం నుండి లేడు" అని మరలా గుర్తు చేసుకుంటూ చెప్పింది —

"ఏమండీ! ప్రసాద్ నిన్న ఎవరితోనో ఫోన్లో చాలా సేపు మాట్లాడుతూ వున్నాడు. సినిమా ఛాన్స్ అంటూ ఏదేదో మాట్లాడినాడు. అంతే కాదండీ! ఎవడో కొత్త సినిమా తీస్తున్నానంటూ పేపర్లో వేసినాడట. తనకు ఛాన్స్ రావొచ్చని చెప్పినాడు. తిట్టి పంపేశాను!"

"ఏ పేపర్లో?" సాలోచనగా అడిగాడు పార్వతీశం.

"ఏమో?"

పార్వతీశం నిన్నటి పేపరు తీసుకుని చూశాడు. లోపలి పేజీలో ప్రకటన కనబడింది! కాస్సేపా ప్రకటననే చూస్తూ ఆలోచించి, క్రింద వు... సుబ్బరాజు నంబరు డయల్ చేశాడు! ఎంగేజ్!!

మళ్ళీ —మళ్ళీ చేశాడు! ఎంగేజ్ సౌండ్ వస్తూనే వుంది!

ఏం చేయాలో తోచక —తన అల్లుడు ఎస్.ఐ.కి విషయం చెప్పడం మంచిదని బయల్దేరాడు పార్వతీశం!

విషయమంతా విన్న ఎస్.ఐ. —తనూ కొద్ది సేపు సుబ్బరాజు నంబరుకు ట్రై చేశాడు! ఎంగేజ్!!

పోలీసు బుర్రతో ఆలోచించడం మొదలెట్టాడు! ఎక్స్ఛేంజికి ఫోన్ చేసి —సుబ్బరాజు ఇంటి అడ్రసు కనుక్కున్నాడు. ఆలస్యం చేయకుండా తన మామతో పాటు జీపులో బయలు దేరాడు సుబ్బరాజింటికి!

** ** **

ఎస్.ఐ. పార్వతీశం, కానిస్టేబుల్ లోపలి కొచ్చారు! సుబ్బరాజు, లక్ష్మి లేచి నిలబడ్డారు!

"సుబ్బ రాజంటే నువ్వేనా?" ఎస్.ఐ. అడిగాడు.

"నే నేనే!" ఆశ్చర్యంలోంచి సుబ్బరాజింకా తేరుకోలేదు! లక్ష్మి మిడిగుడ్లేసుకుని, అంత — కంటే పెద్దగా నోరు తెరుచుకుని నిలబడుంది!

"సినిమా ప్రకటనిచ్చింది నువ్వేనా?"

"అదీ ..." నసిగాడు సుబ్బరాజు!

"నువ్వానా?" ఎస్.ఐ. గొంతు కఠినంగా వినిపించింది!

"నేనే!" భయంతో కేక పెట్టి నట్టుంది సుబ్బరాజు.

"ప్రసాదెక్కడ?"

"ఏ ప్రసాద్?"

ఎస్.ఐ. దగ్గరగా వచ్చాడు! సుబ్బరాజింక ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. ఒంటికి పోసేసుకున్నాడు! పాంటొక మోస్తరుగా తడిసిపోయింది! ఎస్.ఐ. నవ్వు బలవంతాన ఆపుకుంటూ అడిగాడు —

"నీకు సినిమా ఛాన్స్ కోసం ఫోన్ చేసిన ప్రసాద్"

"ఆ! చేశాడు కానీ ఇక్కడకు రాలేదు!"

"విరుస్తా! ఎముకలు!! ప్రసాద్ పదివేలు తీసుకుని నీ దగ్గరకు వచ్చాడని మాకు తెలుసు. మర్యాదగా ఆ పదివేలు ఇచ్చి, ప్రసాద్ ఎక్కడి కెళ్ళాడో చెప్పేస్తే సరి! లేకుంటే? ...."

మధ్యలోనే అందుకున్నాడు సుబ్బరాజు — "సార్! నా కేం తెలీదు! నే నసలు సినిమా తీయటం లేదు! నా దగ్గరంత డబ్బెక్కడుంది?"

"అంటే! ఊర్కినే సినిమా తీస్తున్నట్టు ప్రకటనిచ్చివా?" అడిగాడు ఎస్.ఐ. —"పట్టేశా! పాయింటు" అన్నట్టు చూస్తూ!

సుబ్బరాజు మాట్లాడలేదు!

"అంతేనా?" గద్దించాడు ఎస్.ఐ.

"అంతే! అంతేసార్! కానీ నేనలా ఇచ్చిందీ ..."

ఎస్.ఐ. ఇంక వినలేదు! "కానిస్టేబుల్! లాక్కురా వీణ్ణి" అంటూ కదిలాడు!

అప్పటికే చుట్టుపక్కల జనాలంతా గుమిగూడారు. అందరి మధ్య లోంచి దారి చేస్కుని జీపు దగ్గరకు వెళ్తున్నారు —ముందు ఎస్.ఐ., పార్వతీశం, వెనక కానిస్టేబుల్‌తో పాటు సుబ్బరాజు!

లోపలి సంభాషణ వినడంతో, అక్కడున్న వాళ్ళకు విషయం అర్థమయిపోయింది!

అంతా గుడ్లప్పగించి సుబ్బరాజును చూస్తుంటే, సుబ్బరాజు నేలను చూస్తున్నాడు! గుంపులోంచి మాటలు తూటాల్లా పేలుతున్నాయ్ —

"గోముఖ వ్యాఘ్రము!" పక్కింటి శాస్త్రిగారు!

"పయోముఖ విషకుంభం!" శాస్త్రిగారి భార్య!

"సినిమా పేరుతో మోసం చేసేవాడన్న మాట!" మరొకరు!

"అమ్మాయిల కోసం ప్లానేసుంటాడు!"

"గల్ఫ్‌కు అమ్మడానికేమో?" ఇంకొకరు తగిలించారు!

"బాంబు పేలుళ్ళ కేసులో కూడా సంబంధ ముండే వుంటుంది!"

"పాకిస్తాన్ ఏజంటేమో?"

లక్ష్మి బోరుమంటూ ఇంట్లో కెళ్ళి, ఓపికున్నంత సేపూ ఏడ్చి, భాస్కర్‌కు ఫోన్ చేసి చెప్పింది! పదిహేను నిమిషాలకంతా గాభరాగా వచ్చాడు భాస్కర్. భాస్కర్‌ను పట్టుకుని మళ్ళీ ఏడవడం మొదలెట్టింది లక్ష్మి!

"నా 'ఐడియా' వలనే ఆయనకీ పరిస్థితి దాపురించింది! నన్ను చంపెయ్ అన్నయ్యా!" అంది ఏడుస్తూ.

"ఛ! ఛ! ముందా ఏడుపు ఆపండి. ఇప్పుడేమయిందనీ? స్టేషన్‌కు పోదాం పదా" అంటూ బయలు దేరబోతుంటే —ఇద్దరు యువకులు లోపలికొచ్చారు!

"నా పేరు ప్రసాద్! వీడు నా ఫ్రెండు! మీరు చెప్పకపోయినా —ఎక్స్ఛేంజ్ కెళ్ళి కష్టపడి మీ అడ్రసు కనుక్కున్నాను" అంటూ పదివేల రూపాయల కట్ట బయటికి తీసి —భాస్కర్‌కు అందివ్వబోయాడు —సుబ్బరాజనుకుని!

ఆ డబ్బులు చూస్తూనే —లక్ష్మికి మళ్ళీ 'ఐడియా' తట్టింది! అంతా భాస్కర్‌కు వివరించింది! నలుగురూ ఆత్రంగా స్టేషన్‌కు బయలుదేరారు!

** ** **

భాస్కర్ జరిగిందంతా వివరించాడు స్టేషన్‌లో!

ఎస్.ఐ.కి, పార్వతీశంకు క్షమాపణలు చెప్పుకుని —తప్పుడు ప్రకటన ఇచ్చినట్టు కేసు బుక్ చేయకుండా వదిలి పెట్టినందుకు —వెయ్యి రూపాయలు ఎస్.ఐ.కి సమర్పించుకుని — ఇంటికి చేరుకున్నారు!

** ** **

రెండు రోజులు గడిచి పోయాయి!

ఫోనిప్పుడు —ముడుచుకుని పడుకున్న త్రాచుపాములా కనిపిస్తోంది సుబ్బరాజు, లక్ష్మిలకు. తాకితే కాటేస్తుందన్నట్టు ఎన్నిసార్లు రింగయినా పట్టించుకోవడం లేదు! అసలు దానివైపు చూడాలంటేనే భయం కలుగుతోందిద్దరికీ!

మరుసటి రోజు —

సుబ్బరాజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి రాగానే —టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన కవరందించింది సుబ్బలక్ష్మి! అప్పటికి సుబ్బరాజు ఫోన్ వేయించుకుని ఏడు రోజులయింది! అందులో ఇలా వుంది —ఇంగ్లీషులో —

"అయ్యా!

మీ ఫోను బిల్లు ఏడువేల ఏడు వందల రూపాయలు అయినది. గడువు తేదీలోగా చెల్లించవలెను. లేనిచో మీ ఫోను డిస్‌కనెక్ట్ చేయబడును!

డైరెక్టర్!"

★